క్లుప్తంగా

మద్యం అమ్మిన టీడీపీ నేతలు



సాక్షి, మచిలీపట్నం: ప్రైవేటు మద్యం పాలసీ విధానంతో రాష్ట్ర ప్రభుత్వం మందు దుకాణాలను పల్లె చెంతకు చేరిస్తే.. తెలుగు తమ్ముళ్లు మాత్రం స్వయంగా ప్రజలకు అమ్ముతున్నారు. కృష్ణా జిల్లా పెడనలో టీడీపీ మండల అధ్యక్షుడు సెలపాటి ప్రసాద్, జెడ్పీటీసీ అర్జా వెంకట నగేష్, టీడీపీ మండల కార్యదర్శి సీరం ప్రసాద్ ముగ్గురు కలిసి ఇటీవలే కొత్తగా మూడు మద్యం షాపులను దక్కించుకున్నారు. బుధవారం షాపు ప్రారంభించిన అనంతరం స్వయంగా మందు బాటిళ్లు అమ్మారు. టీడీపీ నేతలు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధితో కలిసి మద్యం అమ్మకాలు చేయడంతో రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తారా అనే చర్చ జరుగుతోంది.

పార్వతీ అమ్మవారికి పూజలు

టేకుపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని టేకుపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీబాల పార్వతీ సమేత రామేశ్వరస్వామివారి దేవస్థానంలో అమ్మవారిని పసుపు కొమ్ము (హరిద్రామూల శాటి)లతో అలంకరించారు. ఆశ్వయుజ పూర్ణిమ సందర్భంగా శ్రీ కంచి కామకోటి పీఠస్థ దేవస్థానంలో బుధవారం ఉదయం భక్తిశ్రద్ధలతో బాలపార్వతీ అమ్మవారికి ఈ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు లంకా ప్రసాద్, అర్చకులు పిల్లలమర్రి శాస్త్రి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం శ్రీ బాలపార్వతీ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అన్న సమారాధన

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి బస్టాండ్ సమీపంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద బుధవారం అన్నసంతర్పణ నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. చుట్టుపక్క గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వర్షాన్ని సైతం లెక్క చేయక తరలివచ్చి అన్న సంతర్పణలో పాల్గొన్నారు. విగ్రహ నిర్వాహకులతో పాటు గ్రామస్తులు సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.


వెండి కిరీటాల బహూకరణ

ఘంటసాల: స్థానిక శ్రీబాల పార్వతీ సమేత శ్రీ జలధీశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు వెండి కిరీటాలను ఏఈవో ఆరాధ్యుల అంకమరావు దంపతులు బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా అర్చకులు చావలి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం అంకమరావు దంపతులు రూ.42 వేల విలువైన 400 గ్రాముల వెండి కిరీటాలను అర్చకులకు అందించారు. అనంతరం అంకమరావు దంపతులకు దేవాలయ ప్రతిమ బహూకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బండి పరాత్పరరావు దంపతులు, రిటైర్డ్ వీఆర్వో నిడుమోలు భద్రిరాజు, తదితరులు పాల్గొన్నారు

వీఎం రంగాకు నివాళి

శ్రీకాకుళం(ఘంటసాల): దసర నవరాత్రుల సందర్భంగా మండలంలోని శ్రీకాకుళం శివారు శీలంవారిపాలెంలో ఏర్పాటు చేసిన అమ్మ వారి విగ్రహం గ్రామోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం సెంటర్లో దివంగత వంగవీటి మోహన రంగా విగ్రహానికి కమిటీ సభ్యులు, యువకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాడికొండ చిన్న ఫ్రెండ్ సర్కిల్, జనసైనికులు, శీలంవారిపాలెం రామాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీని సందర్శించిన ఆర్జేడీ



బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీని రాజమహేంద్రవరంజోన్-2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.శోభారాణి బుధవారం సందర్శించారు. ఆమె అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. సౌకర్యాల గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తు తీర్చిదిద్దుకునేందుకు తీసుకోవలసిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.

మహాయజ్ఞం ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక గాలిగోపురం దేవాలయ సముదాయంలోని సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయంలో బుధవారం 108 రోజుల హనుమాన్ చాలీసా మహాయజ్ఞ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా)లు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తబృందం సభ్యులు చిట్టి ప్రసాద్ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ఈఓ యార్లగడ్డ శ్రీనివాస్, శీలం అశ్వినీకుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు తప్పని పస్తులు

- నగరపాలక సంస్థ సిబ్బంది నిర్లక్ష్యంతో పారిశుద్ధ్య సిబ్బందికి అందని జీతాలు
- జీతాలు అందక పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికుల ఇబ్బందులు
- పండగల సమయాల్లోనూ జీతాలు ఇవ్వకపోవడంపై ఆవేదన



పారిశుద్ధ్య పనిలో నిమగ్నమైన కార్మికురాలు

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల పట్ల కార్యాలయ సిబ్బంది చిన్నచూపు చూస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఇతర కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి దసరాకు ముందే జీతాలు అందేలా చూసిన సిబ్బంది నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు రేయింబవళ్లు పనిచేస్తున్న కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నారు.

పర్యవేక్షణ లోపం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పర్యవేక్షణ లోపంతో కార్యాలయ సిబ్బంది కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. అందువల్లే ఒకటో తేదీన అందాల్సిన జీతాలు ఇప్పటికీ అందలేదు.

దసరా సమయంలోనూ నిరాశే..

సకాలంలో జీతాలు పడకపోవటంతో దసరా పండుగకు కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు కడుపు మాడ్చుకోవాల్సి వచ్చిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరానికి ఒకసారి వచ్చే పెద్ద పండుగ దసరాకు చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బంది పడ్డారు.

నగరంలో 503 మంది..

నగరంలో 503 మంది కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు 50 డివిజన్లలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు కటింగ్‌లు పోనూ రూ.21 వేలు చేతికందుతాయి. నగరపాలక సంస్థ ప్రతినెలా వీరి ఖాతాలో జీతం సొమ్మును జమ చేస్తుంది. అయితే ఈ నెల 16వ తేదీ వచ్చినా జీతం అందలేదు.

దీపావళి వెలుగులు లేనట్టేనా..

15వ తేదీలోపు జీతాలు పడకుంటే ట్రెజరీ అధికారులు సెప్టెంబరు, అక్టోబరు నెల జీతాలను నవంబరులో జమ చేస్తారు. దీంతో ఈ నెల 31వ తేదీ వచ్చే దీపావళి పండుగకు కూడా కార్మికులకు జీతాలు అందని పరిస్థితి నెలకొంది. దీంతో దీపావళికి కూడా తమ కుటుంబాలు చీకటి తప్పదని ఆందోళన చెందుతున్నారు.

కారణం ఇదీ..

నగరంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికుల జీతాలను సకాలంలో చేసి సీఎంఎఫ్‌ఎస్‌లో అప్‌లోడ్ చేయటంలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ జీతాలు రాలేదని కార్మికులు వాపోతున్నారు. అడిగితే తాము సకాలంలోనే అప్‌లోడ్ చేశామని, సర్వర్ ఇబ్బంది వల్ల జాప్యమై ఉంటుందని అంటున్నారు. సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేసి ఉంటే ట్రెజరీ అధికారులు తమ అకౌంట్లకు జీతాలను జమ చేసే వారని, తమ పట్ల వివక్ష చూపటం వల్లే జీతాలు సకాలంలో అందలేదని ఆరోపిస్తున్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతోనే..



పారిశుద్ధ్య కార్మికుల పట్ల నగరపాలక సంస్థ సిబ్బంది వివక్ష చూపుతూ జీతాల బిల్లుల తయారీలో నిర్లక్ష్యం చేయటం వల్లే ఈ పరిస్థితి ఎదురైంది. తరచూ ఇలాంటి నిర్లక్ష్యం జరుగుతూనే ఉంది. నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఇతర కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు అందాయి. కానీ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న కార్మికుల పట్ల వివక్ష చూపుతున్నారు. దీనిపై కమిషనర్‌ను కలిసి అడిగితే సకాలంలో బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెట్టామని అయితే ఎక్కడో పొరపాటు వల్ల ఆలస్యమైందని చెబుతున్నారు. ఇది ఎంత వరకు సమంజసం.

– బూర సుబ్రహ్మణ్యం, సీఐటీయూ జిల్లా కోశాధికారి

నిలిచిపోయిన చెత్త తరలింపు వాహనాలు

నగరంలో పేరుకుపోతున్న చెత్త



క్యాటిల్ డిపోకే పరిమితమైన చెత్త తరలింపు వాహనాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 41 డివిజన్లలో సేకరిస్తున్న చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించేందుకు క్లాప్ పథకం ద్వారా కేటాయించిన వాహనాలు బుధవారం పూర్తిగా నిలిచిపోయాయి. నగరంలో చెత్త తరలింపునకు 41 వాహనాలు ఉన్నాయి. వాహన నిర్వహణకు పెట్రోల్ నింపేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో వాహనాలన్నీ క్యాటిల్‌డిపోకే పరిమితమయ్యాయి. గత మూడు రోజులుగా ఆయిల్ కొరతతో వాహనాలు విడతలవారీగా నిలిచిపోయాయి. దీంతో ఆయా డివిజన్లలో చెత్త తరలింపు జటిలంగా మారింది. డివిజన్లలో చెత్త పేరుకుపోతుండటంతో ఈ చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించేందుకు నగరపాలక సంస్థ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. అయినా పారిశుద్ధ్య నిర్వహణ గాడిన పడలేదు. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. నగరంలో 10 మునిసిపల్ ట్రాక్టర్ల ద్వారా 30 డివిజన్లలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. మెయిన్‌రోడ్డులో ఒక కంపాక్టర్‌తో పాటు రెండు పెద్ద కంపాక్టర్లతో నాలుగు డివిజన్లలో ఉదయం, మధ్యాహ్న సమయాల్లో చెత్త తరలింపు పనులు చేపడుతున్నట్లు పారిశుద్ధ్య విభాగ సిబ్బంది చెబుతున్నారు. అయినా పూర్తిస్థాయిలో చెత్త తరలింపు సాధ్యం కావటం లేదు. పారిశుద్ధ్యం మునుపెన్నడూ లేని విధంగా అస్తవ్యస్తంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు.

టీడీపీ కార్యాలయంగా కార్మికుల మస్టర్ కేంద్రం

- 29వ డివిజన్‌లో టీడీపీ ఇన్‌చార్జ్ నిర్వాకం
- పట్టించుకోని అధికారులు



29వ డివిజన్‌లో కార్మికుల మస్టర్ కేంద్రానికి టీడీపీ ఫ్లెక్సీలు కట్టిన దృశ్యం

మచిలీపట్నంటౌన్: ఏకంగా మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల మస్టర్ కేంద్రాన్ని ఆక్రమించి టీడీపీ కార్యాలయంగా మార్చేశారు. దీనిపై నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులకు ఫిర్యాదులు అందినా స్పందించటం లేదు. ఆ ప్రాంతంలోని టీడీపీకి చెందిన వ్యక్తులే నాయకుల దృష్టికి కూడా తీసుకువెళ్లినా వారు పట్టించుకోవట్లేదంటున్నారు. నగరంలోని 29వ డివిజన్‌లోని చింతగుంటపాలెంలో మునిసిపల్ స్థలంలో, మునిసిపాలిటీకి చెందిన భవనంలో రోజూ విధులకు హాజరవుతున్న పారిశుద్ధ్య కార్మికులకు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో హాజరువేస్తుంటారు. ఈ కార్యాలయంలోనే బ్లీచింగ్, సున్నం, కార్మికులు ఉపయోగించే పరికరాలను భద్రపరుస్తుంటారు. ఆ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి శ్రీ మన్నారాయణమూర్తి ఏకంగా ఈ భవనాన్ని ఆక్రమించి పసుపు రంగు వేయించారు. దానికి టీడీపీ 29వ డివిజన్ కార్యాలయంగా మార్చేశారు. ప్రజాప్రతినిధి, ఆ డివిజన్ టీడీపీ, జనసేన కార్యకర్తల ఫొటోలతో వేయించిన బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఈ భవనం వద్ద కార్మికులకు మస్టర్ వేయనివ్వకుండా ఆపేశారు. దీంతో సచివాలయం వద్ద మస్టర్లు వేయించడం విమర్శలకు తావిస్తోంది. నగరపాలక సంస్థ అధికారులు ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సత్రవు సెంటర్లో వైన్ షాపును తరలించాలి

రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులకు మహిళల వినతి



మొవ్వ ఎక్సైజ్ సీఐ వరాలరాజుకు అర్జీ ఇస్తున్న ఘంటసాల సత్రవు సెంటర్ వాసులు

ఘంటసాల: స్థానిక సత్రవు సెంటర్లోని మద్యం షాపును ఊరి చివరకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మద్యం షాపు పరిసర ప్రాంతాల మహిళలు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దార్ బి.విజయ ప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘంటసాల సత్రవు సెంటర్లోని మద్యం షాపు వల్ల సత్రవు సెంటరు, 1వ వార్డు, 2వ వార్డు ప్రజలం ఇబ్బందులు పడుతున్నామన్నారు. షాపు వద్ద జనం గుంపులుగా ఉండటంతో వాహనాలకు, రోడ్డుపై వెళ్లే వారికి దారి ఇవ్వటం లేదన్నారు. మహిళలు, కాలేజీకి విద్యార్థినులు వెళ్లేటప్పుడు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. మద్యం షాపును ఊరు చివరలో ఏర్పాటు చేయాలని కోరారు. పంచాయతీ వారు మద్యం షాపు సత్రవు సెంటర్లో నిర్వహించడానికి వీలులేదని తీర్మానం చేసినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. అధికారులు స్పందించి మద్యం షాపును ఊరి చివర పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందం నరసింహ, జగ్గారపు నాగేశ్వరరావు, అభినందన వెంకటేశ్వరరావు, నందం సుజాత, జగ్గారపు సుశీల, రేఖ శ్రీ, సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఘంటసాల సత్రవు సెంటరులో స్థానికులు ఇచ్చిన అర్జీలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం.

– బి.వరాలరాజు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, మొవ్వ

సీవేజ్ ప్లాంట్ల నిర్మాణానికి స్థలాల పరిశీలన



పెడన: పట్టణంలో మురుగునీటిని పరిశుభ్రపరిచి, శుద్ధజలంగామార్చి పంట కాలువలోకి వదిలే విధంగా సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మాణానికి అనువైన స్థలాలను అధికారులు బుధవారం పరిశీలించారు. కొంకేపూడి పంచాయతీ పరిధిలోని కట్లపల్లి ప్రాంతంలో, పెడన-మచిలీపట్నం బైపాస్‌రోడ్డులోని రైల్వే ట్రాక్ పక్కన 15వ వార్డులో, రెండో వార్డులో తామర చెరువు సమీపంలో ప్లాంట్ల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. ఉన్నతాధి కారులకు నివేదికలను పంపిస్తామని తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, ఏవో నూరున్నీసా, టీపీవో సుజన కుమారి, మండల సర్వేయర్ దాసు ఉన్నారు.

సంక్షిప్తంగా...

● ఆర్‌ఎస్‌కేలలో ఈ క్రాప్ జాబితా

పెడన: మండలంలోని రైతు సేవా కేంద్రాలలో ఈ క్రాప్ జాబితాలను ప్రదర్శించామని, వాటిల్లో ఏమైనా సందేహాలు, అనుమానాలుంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని వీఏఏలు బుధవారం స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా వీఏఏలు, ఎంపీఈవోలు వారి వారి రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాలపై ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా స్పందిస్తూ రైతులకు అందుబాటులో ఉండేలా చూడటమే కాకుండా వారి సందేహాలను నివృత్తి చేసేలా సిబ్బంది చర్యలు చేపడుతున్నారని స్పష్టం చేశారు.

● ఎస్పీ కార్యాలయ ఏవోగా సుబ్రహ్మణ్యం

కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా పోలీసు కార్యాలయ ఏవోగా సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న మూర్తిని కాకినాడ ఏవోగా బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఏవో బాధ్యతలు తీసుకున్న సుబ్రహ్మణ్యం జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను అందజేశారు.

● రిటైర్డు వీఆర్వో ఇంట్లో చోరీ

కోనేరుసెంటర్: మచిలీపట్నంలోని ఓ రిటైర్డు వీఆర్వో ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. నగలు, నగదు అపహరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం పాత హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన సింగంశెట్టి భరత్‌రావు రెవెన్యూశాఖలో వీఆర్వోగా ఉద్యోగ విరమణ చేశారు. ఈ నెల 1వ తేదీన హైదరాబాదులోని తన కుమారుడి ఇంటికి భార్యతో కలిసి వెళ్లాడు. 16న ఉదయం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. భరత్‌రావు పోలీసులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. పోలీసులు ఇంట్లో పరిశీలించగా చోరీకి పాల్పడినట్లుగా గ్రహించారు. బీరువాలోని కొంత నగదుతో పాటు మరి కొంత బంగారు ఆభరణాలను దుండగులు అపహరించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నబీ తెలిపారు.

● టెట్ పరీక్ష ప్రశాంతం

పెడన: జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పెడన మండలం నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల, పెనమలూరు మండలం కానూరులో అయాన్ (ఐఓఎన్) డిజిటల్ జోన్ కేంద్రం, వంద అడుగుల రోడ్‌లోని ఐడ్జ్(ఐడీజడ్)లో ఈ మూడు సెంటర్లలో టెట్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఆయా కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 1,335 మందికి గాను 1,059 మంది హాజరయ్యారు. 276 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్లో 1,305 మందికి గాను 1,106 మంది హాజరవ్వగా 199 మంది హాజరవ్వలేదు. రెండు సెషన్లకు గాను మొత్తం 2,640 మందికి గాను 2,165 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. 475 మంది గైర్హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, డీఈవో కార్యాలయం ఏడీ మనోహర్ నాయక్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పెడన నందమూరు పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ బీఆర్‌ఎస్‌రెడ్డి, ఆడ్మిన్ పి.అశోక్‌కుమార్‌లు పర్యవేక్షించారు.

● ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

కోనేరుసెంటర్: మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి వివాహం చేసుకున్న ఓ ఆటోడ్రైవర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. మచిలీపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం బందరుకోటకు చెందిన దేవబోయిన మణికంఠ ఆటో నడుపుతుంటాడు. ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలిక (14)ను గత ఆరు నెలలుగా ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. మాయమాటలు చెప్పి అనేక సార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ నెల 13వ తేదీన బాలికను బలవంతంగా లాక్కెళ్లి ఊళ్లోని ఓ దేవాలయంలో వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లితండ్రులు తమ కుమార్తెకు జరిగిన అన్యాయంపై మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు మణికంఠపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపారు.

● రోగులకు వైద్య పరీక్షలు

ఘంటసాల: ప్రతి నెలా 104 వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఘంటసాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ అన్నారు. పెద్దగూడెం కమ్యూనిటీ హాలులో బుధవారం 104 వైద్య సేవలను నిర్వహించారు. డాక్టర్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరూ ఆధార్, ఫోన్ నంబరు ఆసుపత్రి సిబ్బందికి ఇచ్చి నమోదు చేయించుకోవాలని డాక్టర్ కోరారు.

● పౌష్టికాహార కిట్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: క్షయవ్యాధితో బాధపడుతున్న వారికి స్థానిక మల్కాపట్నంలోని క్షయ వ్యాధి నివారణ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ముత్తూట్ ఫైనాన్స్, కారుణ్య యూత్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 50 మంది వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ గోపాలకృష్ణ, కెవైఆర్‌డీ సంస్థ ప్రతినిధులు మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆంజనేయుడికి విశేష పూజలు

చల్లపల్లి (అవనిగడ్డ): మండలంలోని నారాయణరావు నగర్ వద్ద విజయవాడ రోడ్డులో ప్రసన్న భక్తాంజనేయ స్వామివారి ప్రథమ వార్షికోత్సవం బుధవారంనిర్వహించారు. ఉదయం ఆలయ ప్రధానార్చకుడు వేమూరి శ్రీనివాసశర్మ మంత్రోచ్చరణ నడుమ ఆంజనేయుడి మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. చల్లపల్లి, మోపిదేవి ఎస్‌ఐలు సుబ్రహ్మణ్యం, సత్యన్నారాయణలు వేడుకల్లో పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించారు.

● నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

పెడన: రోడ్డు నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా అమలు చేస్తే ప్రమాదాలు చాలా వరకు నివారించవచ్చని జిల్లా రవాణా శాఖాధికారి ఎస్.మనీషా అన్నారు. బుధవారం మండలంలోని నందమూరు శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాలో రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రసంగించారు. విద్యార్థులు, కళాశాల బస్సు డ్రైవర్లను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అతివేగం వద్దని, ఓవర్‌టేక్‌లు అత్యంత ప్రమాదరకరమని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా ప్రయాణం అత్యంత ప్రమాదకరమన్నారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ నాయక్, సిద్ధిక్వి, కళాశాల కరెస్పాండంట్ కె.కుమార్ బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.బాబా, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్‌ఎస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

● వృద్ధులు, దివ్యాంగులకు వైద్య పరీక్షలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి జట్టి నరసింహం ప్రభుత్వ వృద్ధుల, దివ్యాంగుల ఆశ్రమంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జి. గీతాబాయి ప్రారంభించారు. మల్టీ స్పెషాలిటీ కాంప్రెహెన్సివ్ గెరియాట్రిక్ అసెస్‌మెంట్ క్యాంపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎన్‌సీడీసీడీ, ఆర్‌బీ ఎస్‌కే కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ హిమబిందు పర్యవేక్షణలో జిల్లా సర్వజన ఆసుపత్రికి చెందిన జనరల్ ఫిజీషియన్లు, నేత్ర, వినికిడి తదితర విభాగాల వైద్యులు వృద్ధులు, వికలాంగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీజీ, 2డీ ఎకో, సిటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్‌లు, రక్తపరీక్షలు చేయించారు. వినికిడి పరీక్షల అనంతరం పరికరాలు కావాల్సిన వారి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ సుందరాచారి, సర్జన్ సీతారాం, జనరల్ ఫిజీషియన్లు ప్రమీల, సాగర్, దంత వైద్యురాలు శ్రీజ, వీరేంద్రనాథ్, ఆడియాలజిస్ట్ కీర్తి ప్రసన్న, ఆప్టోమెట్రిస్ట్ భూపాలాచారి తదితరులు వైద్యసేవలు అందించారు.

● సీఎన్‌జీ గ్యాస్ కొరత తీర్చాలి

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో సీఎన్జీ గ్యాస్ సమస్యను పరిష్కరించి ఆటో కుటుంబాలను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మచిలీపట్నంలో సీఎన్జీ గ్యాస్ కొరత సమస్యను వెంటనే పరిష్కరించి ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ పట్టణశాఖ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు, ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మచిలీపట్నంలో సీఎన్జీ గ్యాస్ సరఫరా లేక ఆటోవాలాలు జీవనభృతి పొందటం కష్టంగా మారిందన్నారు. దాదాపు 500 కుటుంబాలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. మచిలీపట్నంలో గ్యాస్ సరఫరా లేక పెడన, పామర్రు, గుడివాడ ప్రాంతాలకు వెళ్లి గ్యాస్ ఫిల్ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అధికారులు తక్షణమే సీఎన్జీ బంకులను ప్రారంభించి ఆటోడ్రైవర్లకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ జయరావు, సీఎన్జీ ఆటో యూనియన్ కన్వీనర్ కరిముల్లా, షేక్ బాజీ, బాలు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి (అవనిగడ్డ): దివిసీమలో వాణిజ్య కేంద్రమైన చల్లపల్లిని పారిశ్రామిక, ఐటీ రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా చల్లపల్లి మండలంలో రూ.1.27 కోట్ల నిధులతో చేపట్టే సీసీ రోడ్ల పనులకు భూమి పూజలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి పరీక్ష కేంద్ర నిర్మాణానికి ఆమోద ముద్ర వేసిందని, దీంతో ఈ క్షిపణి కేంద్రానికి అనుబంధ పరిశ్రమలను చల్లపల్లిలోనే ఏర్పాటు చేయనున్నట్లు బుద్ధప్రసాద్ చెప్పారు. నియోజకవర్గంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న యువత కోసం పరిశ్రమలను ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఉందని, ఐటీ రంగాభివృద్ధి కృషి చేస్తానన్నారు. బుద్ధప్రసాద్, ఆయన తనయుడు వెంకట్రామ్ (రాజా)ను కూటమి నేతలు సత్కరించారు. సర్పంచి పైడిపాములు కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీడీఓ అనగాని వెంకటరమణ, పీఆర్ డీఈ పగడాల సురేష్‌బాబు, ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఏపీఓ రాజ్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖలాధికారులు పాల్గొన్నారు.

మల్లంపల్లి(ఘంటసాల): మండల పరిధిలోని మల్లంపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న మూడు సీసీ రోడ్లకు ఎంపీటీసీ కొలుసు ఝాన్సీ లక్ష్మి, సర్పంచ్ బెల్లంకొండ అమలేశ్వరరావు భూమి పూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ నయూమ్, స్థానికులు పాల్గొన్నారు. ఘంటసాల పాలెం గ్రామంలో రూ.13.50 లక్షలతో నిర్మిస్తున్న రెండు సీసీ రోడ్ల నిర్మాణం పనులను సర్పంచ్ దోనె రజనీ, ఎంపీటీసీ కొల్లూరి విజయ, మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, టీడీపీ నేత వేమూరి సాయి వెంకటరమణ ప్రారంభించారు. ఉప సర్పంచ్ లక్ష్మి, ఈవో బి.అర్జునరావు, మూల్పూరి వెంకయ్య, దోనె వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. చినకళ్లేపల్లి గ్రామంలో రూ.12.50 లక్షలతో నిర్మిస్తున్న రెండు సీసీ రోడ్ల పనులను సర్పంచ్ గుత్తికొండ రామారావు (రాము) ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ నయూమ్ పాల్గొన్నారు.

బంటుమిల్లి: పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలోని నాగేశ్వరరావు పేట పంచాయతీ పరిధిలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పర్యటించారు. నాగేశ్వరరావు పేట నూతన సచివాలయం ప్రారంభోత్సవం చేశారు. గ్రామంలో సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జానకిరామపురం గ్రామంలో సుమారు రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం నూతన భవనాన్ని ప్రారంభించారు. లక్ష్మీనారాయణపురం గ్రామంలో సుమారు రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లుకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. సర్పంచు తాతా మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ దాసరి కరుణ, జేఎస్పీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త పి.సురేష్, సీడీపీవో సముద్రవేణి, ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజాకుమారి, ఎంఈవో త్రిపురసుందరీ దేవి, పలు గ్రామాల సర్పంచులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'పీఎం కిసాన్' వర్తించడం లేదని ఫిర్యాదు

పెడన: పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వ నగదు జమకావడం లేదంటూ కొందరు రైతులు ఇన్‌చార్జి వ్యవసాయశాఖాధికారి నూరున్నీసాను కలిసి మొర పెట్టుకున్నారు. బుధవారం కార్యాలయంలో ఏవో నూరున్నీసాను కలిసి మాట్లాడారు. తమ పేర్లు పీఎం కిసాన్‌లో నమోదు అయి ఉండేవని, ఇప్పుడు ఎందుకు లేవని ప్రశ్నించారు. పీఎం కిసాన్‌లో పేర్లు లేనప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసాకు కూడా తమ పేర్లు ఉండవేమోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయని వాపోయారు. వీటిపై స్పందించిన ఏవో నూరున్నీసా మాట్లాడుతూ కారణాలను తెలుసుకుంటామని, డాక్యుమెంట్ల నకళ్లతో వినతి పత్రం ఇవ్వాలని సూచించారు. మీ పేరుమీద ఉన్న పొలం వివరాలను ఇవ్వాల్సిందిగా స్పష్టం చేశారు. మరికొందరు ఈకేవైసీ ఇంకా నమోదు చేయలేదని పేర్కొవడంతో వారి నుంచి లిఖితపూర్వకంగా వినతి పత్రం తీసుకున్నారు. వీఏఏ సుజన ఉన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి

పెడన: చదవడం, రాయడం వంటి వాటితో ఇబ్బంది పడుతూ డిస్లెక్సియా రుగ్మతతో బాధపడుతున్న వారిని గుర్తించి వారిలో ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించాలని ఎంఈవో-1 త్రిపురసుందరీ దేవీ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభ్యసన వైకల్యంపై భవిత కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో భయాందోళనలను తొలగించేలా కృషి చేయాలన్నారు. ఎంఈవో-2 వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

అవనిగడ్డ: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..అవనిగడ్డకు చెందిన కోసూరు రాజారావు (రాజా) అక్రమంగా రేషన్ బియ్యాన్ని వ్యాన్‌లో తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం రావడంతో దాడులు చేసి రెండుటన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. వ్యాన్‌ను సీజ్ చేసి నిందితుడు రాజారావును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

జోరుగా వర్షం

కృత్తివెన్ను: వాయుగుండం ప్రభావంతో బుధవారం మండల వ్యాప్తంగా ఉదయం నుంచి వర్షం కుండపోతగా కురిసింది. వర్షం కారణంగా జనజీవనం స్తంభించి పోయింది. ప్రజలకు ఇళ్లకే పరిమితమయ్యారు. పల్లపు ప్రాంతాలలోకి వర్షం నీరుచేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం మరింత ఎక్కువగా కురిస్తే ఆక్వాచెరువులు నీటమునిగి గండ్లు పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.